అంచనాలు తలకిందులు

రికార్డ్ సృష్టించిన కేపీ వివేకానంద్



నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అందరి అంచనాలను తలకిందులు చేసి రికార్డు స్థాయిలో 85,576 ఓట్ల మెజార్టీ సాధించి హ్యాట్రిక్ సాధించారు. ఏకంగా రాష్ట్రంలోనే అందరి కంటే ఎక్కువ మెజార్టీ సాధించిన ఎమ్మెల్యేగా రికార్డుకు ఎక్కడం విశేషం. బీఆర్ఎస్ నుంచి కేపీ వివేకానంద్‌కు ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు బీజేపీ నుంచి కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌లు ఎక్కడ కూడా పోటీ ఇవ్వలేకపోయారు.

◆ కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్రమైన పోటీ ఉంటుందని అందరూ భావించారు. కాని మొదటి రౌండ్ నుంచి చివరి వరకు రౌండ్ వరకు బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్ ఏకపక్షంగా ఆధిపత్యం కనబరిచారు. ఎక్కడ ఆ జాడ కూడా కనిపించలేదు. బీజేపీ పార్టీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ జనసేన మద్దతుతో ప్రచారాన్ని ఉధృతం చేసినప్పటికి ఓట్ల రూపంలోకి మార్చలేకపోయారు.

◆ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలను హన్మంత్‌రెడ్డి టీడీపీ మద్దతు ఉండటంతో విజయం నల్లేరు మీదా నడకే అని భావించారు. కాని రిజల్ట్ మాత్రం రివర్స్ అయ్యింది. దీంతో వివేకానంద్ విజయాన్ని ఏవ్వరు నిలువరించలేకపోయారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు కుత్బుల్లాపూర్‌లో విజయోత్సవాలు జరుపుకుంటున్నారు.

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 3,99,783 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో బీబీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్‌కు 1,87,999 ఓట్లు లభించాయి. బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్‌కు 1,02,423 ఓట్లు రాగ, కాంగ్రెస్ అభ్యర్థి కొలను హన్మంత్‌రెడ్డికి 1,01,554 ఓట్లు దక్కి మూడవ స్థానంలో నిలిచారు. బీఎస్పీ మహమ్మద్ అహ్మద్ లంరాకు 1759, సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి అభ్యర్థికి 746, స్వతంత్ర అభ్యర్థి సాయికుమార్ పంతుల 603 ఓటు, విద్యార్థుల రాజకీయ పార్టీ చౌదరి గారి స్వాతిక 247, ఇండియా ప్రజా బంధు పార్టీ సువర్ణ 256, అల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ రమేష్ ముదిరాజ్ 137, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ మహమ్మద్ వజిద్ 150, సీపీఎం రవీందర్ 199, స్వతంత్రులు దుర్గారావు 299, శివకుమార్435, మహమ్మద్ మహిసన్ 279, బాగిలి శ్రీనివాస్‌రెడ్డి 502, నోటాకు 4079 ఓట్లు లభించాయి.



వివేకానంద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎంపీపీ సన్న కవిత, మహిళలు

వివేకానంద్‌కు శుభాకాంక్షలు

- రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో చరిత్ర
- ఏకంగా 85,576 ఓట్ల మెజార్టీతో గెలుపు
- హర్షం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యే వివేకానంద్ దంపతులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు



సిక్కులతో వారి వేషధారణలో వివేకానంద్

కుత్బుల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 85,576 ఓట్ల మెజార్టీ సాధించి రాష్ట్రంలోనే రికార్డు సాధించిన కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. నియోజకవర్గంలోని ఆయన నివాసం, క్యాంప్ కార్యాలయాలకు బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, వివిధ ప్రాంతాల ప్రజలు భారీగా తరలివస్తున్నారు. బోకేలు, పూలదండలు, శాలువాలతో సత్కరిస్తూ అభినందనలు తెలుపుతున్నారు.

◆ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, నిజాంపేట మేయర్ కొలన్ నీలారెడ్డి, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మాజీ ఎంపీపీలు చినంగి వెంకటేశం, సన్న కవిత, కార్పొరేటర్లు కె.జగన్, మంత్రి సత్యనారాయణ, రావుల శేషగిరి, నేతలు బూర్గుబావి హన్మంత్‌రావు, సురేశ్‌రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

◆ **వేదపండితుల ఆశీర్వాదం..**

హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే వివేకానంద్‌ను రాష్ట్రంలోని పలు దేవాలయాల అర్చకులు ఆశీర్వదించారు. ప్రజల మద్దతుతో అఖండ విజయం సాధించిన వివేకానంద్‌కు దేవుడి ఆశీస్సులు ఉంటాయని దీవించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

వైఎస్ షర్మిలను కలిసిన సాతాల గోపాల్



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వైఎస్ఆర్ టీపీ కోఆర్డినేటర్ సాతాల గోపాల్ ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కలిశారు. సోమవారం లోటస్‌పాండ్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అభ్యర్థి గెలుపోటములపై చర్చించినట్లు గోపాల్ తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యకర్తలకు మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత్రి షర్మిల ఆదేశాలను పాటిస్తూ నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు.

'మానూ'లో ముగిసిన రైస్- 2023

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 'రైస్-2023' అంతర్జాతీయ సదస్సు ముగిసింది. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్‌సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, సెంట్రల్ అమెరికాలోని ఎల్ సాల్వడార్‌లోని యూనివర్సిడాడ్ డాన్ బాస్కో సంయుక్త ఆధ్వర్యంలో రెండ్రోజుల 8వ అంతర్జాతీయ సదస్సు 'కాన్ఫరెన్స్ ఆన్ ఇంటలిజెంట్ కంప్యూటింగ్ ఇన్ ఇంజినీరింగ్ (రైస్-2023) ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. హనోయ్‌లోని హనోయ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండస్ట్రీకి చెందిన డాక్టర్ బుయ్ టియోన్‌సన్ 'యూఏవీల కోసం భద్రత తాకిడి వైపు' అనే అంశంపై ప్రసంగించారు. ప్రోగ్రామ్ చైర్మన్ డాక్టర్ విజయేందర్‌కుమార్ సోలంకి, సీఎస్ అండ్ ఐటీ విభాగం కన్వీనర్, హెడ్ ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ ముగింపు సమావేశంలో మాట్లాడుతూ.. రెండ్రోజుల పాటు దిగ్విజయంగా ఈ సదస్సును నిర్వహించామన్నారు. మొత్తం 106 పేపర్లలో 46 ఆమోదించబడ్డాయని, అధికారిక ప్రక్రియల కోసం 22 ఎంపిక చేయబడ్డాయన్నారు. డాక్టోరల్ సింపోజియంలో ప్రదర్శన కోసం అదనంగా 24 ఎంపిక చేయబడ్డాయన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గీతాపట్టున్, ప్రొఫెసర్లు ప్రసంగించారు.

చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలి



రామ్‌లీలా మైదానంలో స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న కృషి హైస్కూల్ విద్యార్థులు

సుభాష్‌నగర్: సూరారం కాలనీలోని కృషి హైస్కూల్ స్పోర్ట్స్ ఫెస్ట్ సోమవారం రామ్‌లీలా మైదానంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జీడిమెట్ల ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు చదువుతో పాటు ఆటపాటల్లో కూడా రాణించాలన్నారు. ఆటలతో మానసిక వికాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందన్నారు. పోటీలలో గెలుపు ఓటములు సహజమన్నారు. ఓడిపోయినా ఏ మాత్రం బాధపడకుండా మరింత పట్టుదలతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ పోరంకి శ్యామ్ ప్రసాద్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'డేర్ టు డ్రీమ్' అనే అంశంపై చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖనంలో పాల్గొన్న వీఆఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి పాఠశాల విద్యార్థులు

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాలలో సోమవారం ప్రగతి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'పీస్ పోస్టర్'డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతి ఏటా ఒక్కొక్క అంశంతో లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా ఈసారి 'డేర్ టు డ్రీమ్'అనే అంశంపై అంతర్జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. లయన్స్ పీస్ పోస్టర్ కాంటెస్ట్ డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ సత్యవోలు రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాలకు చెందిన 300 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇచ్చిన అంశం మీద అద్భుతమైన దృశ్యాలను చిత్రించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ విజయ రాణి, డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, ఎల్లా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకోవడంతో క్యూ కట్టారు..



జగద్గిరిగుట్ట: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కౌంటింగ్ నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచి రెండు రోజుల పాటు వైన్స్ దుకాణాలను అధికారులు మూసి వేయించారు. సోమవారం ఉదయం వైన్స్ దుకాణాలు తిరిగి తెరుచుకోవడంతో మందుబాబులు వైన్స్‌ల వద్ద క్యూలు కట్టారు. చింతల్ ప్రధాన రోడ్డులో ఉన్న ఓ దుకాణం వద్ద మద్యం కొనుగోలు దారులతో కిటకిటలాడింది.

కూల్చిన చోటే కొత్త షెల్టర్‌ను నిర్మించాలి



రంగారెడ్డినగర్ బస్‌షెల్టర్ ప్రాంతంలో వెలిసిన డబ్బాలు, నిలుపుతున్న ఆటోలు

రంగారెడ్డినగర్: ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌ను అధికారులు కూల్చివేయడంతో ప్రస్తుతం ఆ స్థలం కబ్జా చెరలో చిక్కుకుంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట-ఐడీపీఎల్ రోడ్డులో ఉన్న రంగారెడ్డినగర్ బస్టాప్‌ను ఇటీవల ఆధునీకరించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. అయితే ఎన్నికల హడావుడితో గత రెండు నెలలుగా అధికారులు బస్‌షెల్టర్ నిర్మాణాన్ని చేపట్టకుండా వదిలేశారు.

– ఇప్పటికే బస్ షెల్టర్‌కు ఇరువైపులా పలు డబ్బాలు ఏర్పాటు చేయగా తాజాగా బస్‌షెల్టర్ కూల్చివేసిన ప్రాంతంలో డబ్బాలు వెలియడంతో పాటు ఆటోలను నిలుపుతున్నారు. దీంతో నిక్షేపంలాంటి బస్‌షెల్టర్‌ను కూల్చివేసి అధికారులు తమకు నిలువనీడ లేకుండా చేశారని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సర్కిల్ అధికారులు కూల్చివేసిన ప్రాంతంలో కొత్త షెల్టర్‌ను నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అడ్డూ అదుపు లేకుండా డంపింగ్



బ్రెడ్ తయారీ పరిశ్రమ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పేరుకుపోయిన చెత్త

రంగారెడ్డినగర్: భవన నిర్మాణ వ్యర్థల డంపింగ్‌పై అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ప్రధాన రహదారులతో పాటు ఎక్కడ ఖాళీ స్థలం కనబడితే అక్కడ చెత్తను పారబోస్తున్నారు. దీనికి తోడు రోజుల తరబడి వ్యర్థాలను తరలించకపోవడంతో సమస్య మరింత జఠిలంగా మారుతోంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్‌కు వెళ్లే దారిలోని బ్రెడ్ తయారీ కంపెనీ సమీపంలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త గుట్టలుగా పేరుకుపోతోంది. రోజు విడిచి రోజు చెత్తను తరలించకపోవడంతో రోడ్డుపైకి వ్యర్థాలు వస్తున్నాయి. ఎవరైనా చెత్తను నిప్పు పెడితే సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు అంటుకుని పెను ప్రమాదం జరిగే అవకాశముంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రమాదం జరుగకముందే ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతంలో చెత్త వేయకుండా కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

సన్మానం



కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దుండిగల్: బౌరంపేట్‌లోని శ్రీ ఆశ్రిత వత్సల అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు. సోమవారం స్థానిక కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాములకు అన్నదానం నిర్వహించారు. అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములకు 41 రోజుల పాటు ప్రతి రోజు 500 మందికి అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్నె శేఖర్, రాజుగౌడ్, కటకం వీరేశ్, ప్రదీప్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు సౌత్‌జోన్ క్రీడాకారుల ఎంపిక

బాలానగర్: జేఎన్‌టీయూ యూనివర్సిటీలో మెన్స్ హ్యాండ్‌బాల్ పోటీలకు సౌత్‌జోన్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ ఎంపికకు ముఖ్య అతిథిగా వీసీ ఓఎస్‌డీ ప్రొ. డా.బాలునాయక్ హాజరయ్యారు.యూనివర్సిటీ పరిధిలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన క్రీడాకారులు ఎంపికలో పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 24న కేరళలోని కొట్టాయంలో జరిగే ఫైనల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ డా. నల్లగొండ అశోక్ క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయటం చాలా అభినందనీయమని వీసీ అన్నారు. క్రీడాకారులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి సరైన శిక్షణ ఇవ్వటంతో డాక్టర్ అశోక్ పాత్ర కీలకమైనదన్నారు. దిలీప్ మాట్లాడుతూ.. క్రీడాకారులు యూనివర్సిటీలో ఉన్న ప్రతి సౌకర్యాలను ఉపయోగించుకోవాలని అన్నారు.

9 నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఆధ్వర్యంలో శారీస్ ఆఫ్ ఇండియా పేరిట చేనేత వస్త్ర ప్రదర్శనను ఈ నెల 9 నుంచి ఐదు రోజులపాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వినయ్‌కుమార్, శ్రీనివాసరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు





కార్తీక మాసం మూడో సోమవారం పురస్కరించుకొని నియోజకవర్గంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివుడికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం వేళ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించారు. సూరారం ఉమామహేశ్వర స్వామిని లక్ష బిల్వ పత్రాలతో సమర్పించారు. అదే విధంగా అంగడిపేట్ శివాలయంలో అభిషేకాలు, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. – సుభాష్‌నగర్





తాగునీటి సరఫరాపై జీఎం ఆకస్మిక తనిఖీలు



సంజయ్ గాంధీనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న వాటర్‌వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి

చింతల్: తాగునీటి సరఫరా పరిస్థితులపై సోమవారం కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు చేశారు. భగత్‌సింగ్‌నగర్ సెక్షన్ పరిధిలోని గుబురుగుట్ట, సంజయ్ గాంధీనగర్, నందానగర్ తదితర ప్రాంతాల్లో సెక్షన్ మేనేజర్ పూజితతో కలిసి పర్యటించారు. తాగునీటి సరఫరాలో వస్తున్న అంతరాయాలపై వినియోగదారులను అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. అదే విధంగా వ్యవస్థ పనితీరులో భాగంగా ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని అన్నారు. నేరుగా వచ్చిన ఫిర్యాదులు, ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను ఏరోజుకారోజు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

నిర్లక్ష్యం.. నీరు రోడ్డుపాలు



వృథాగా పోతున్న గోదావరి జలాలు

కుత్బుల్లాపూర్: తవ్వి వదిలేశారు.. ఆపై ఆ ప్రాంతానికి నీరు వదిలారు.. ఇంకేముంది రోడ్డుపై గోదావరి నీరు పొంగిపొర్లింది. అధికారుల నిర్లక్ష్యం సిబ్బంది ఇష్టారాజ్యం వేసి గణేష్ నగర్ ప్రధాన రహదారి కమాన్ వద్ద ఇలా మంజీరా నీరంతా వృథాగా పోతూ కనిపించింది. వాటర్ వర్క్స్ అధికారులు మరమ్మతులు చేసే ప్రాంతంలో నీరు వదిలే సమయానికి పనులు పూర్తి అయ్యాయా లేదా లేదా అన్న విషయాన్ని గుర్తించకుండా లైన్‌మెన్ ఇలా వాల్వ్ ఓపెన్ చేయడంతో నీరు వరదలా పారింది.

'ముస్లిం సమాజానికి కేసీఆర్ సమాధానం చెప్పాలి'

- ముస్లింల సమస్యలను కాంగ్రెస్ పరిష్కరించాలి
- ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి

పంజగుట్ట: కాంగ్రెస్ పార్టీ గెలుపులో ముస్లిం సమాజం తోడ్పాటు ఎంతో ఉందని... పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో ముస్లిం సమాజానికి కేసీఆర్ సమాధానం చెప్పాల్సిన 10 ప్రశ్నలు సంధించామని అది ప్రజల్లోకి ఎంతో వెళ్లిందని ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ షేక్ ఇస్లాముద్దీన్ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా దళిత ముస్లిం ఎస్సీ రిజర్వేషన్ ఫోరం అధ్యక్షుడు షేక్ సత్తార్ సాహెబ్‌తో కలిసి మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ముస్లింలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడాన్ని తాము ప్రశ్నించామన్నారు. వీటిని ఓ పుస్తకం రూపంలో తీసుకొచ్చి సమాధానం చెప్పాలని ప్రజల్లోకి తీసుకెళ్లినట్లు తెలిపారు. ముస్లిం రిజర్వేషన్లు 12 శాతం ఇస్తామని ఇవ్వకపోవడం, ఉర్దూ రెండవ అధికార భాషగా గుర్తిస్తామన్న హామీ, ముస్లింల శ్మశానాలకు స్థలం కేటాయిస్తానని కేటాయించకపోవడం, కోకాపేటలో ఇస్లామిక్ సెంటర్ ఏర్పాటు చేస్తానని చెయ్యలేదు, మైనార్టీ కార్పొరేషన్ నిర్వీర్యం చేయడం మైనార్టీ గురుకులాలకు శాశ్వత భవనాలు లేకపోవడం, ఇమామ్, మౌజన్‌లకు జీతం పెంచుతామని పెంచకపోవడం, బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించకపోవడం లాంటి 10 ప్రశ్నలు ముస్లిం సమాజంలోకి తీసుకెళ్లి కాంగ్రెస్‌కు మద్దతు పలికినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సమస్యలను పరిష్కరించాలని, ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చాలని కోరారు. గత ప్రభుత్వం హయాంలో మూతపడ్డ ప్రభుత్వ స్కూల్స్ తిరిగి ప్రారంభించాలన్నారు. సమావేశంలో అబ్దుల్ షాహిద్, ఖలీల్ అహ్మద్, మజిద్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారుతున్నా పట్టించుకోరా?



జయరామ్‌నగర్-భాగ్యలక్ష్మి కాలనీ రోడ్డులో పారుతున్న మురుగు

కుతుల్లాపూర్: అది ప్రధాన రహదారి.. నిత్యం వందలాది వాహనాలు అటు ఇటు వెళ్తూ ఉంటాయి... వివిధ విభాగాల అధికారులు సైతం రాకపోకలు సాగిస్తూ వస్తున్నారు.. జయరామ్‌నగర్ -భాగ్యలక్ష్మీ కాలనీ మధ్యలో ఉన్న ప్రధాన రహదారి డ్రైనేజీ సమస్య కోసం ఇటీవల ఎస్ఆర్‌డీపీలతో రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేపట్టి వదిలేశారు. అంతవరకు బాగానే ఉంది కానీ నిత్యం డ్రైనేజీ నీరంతా రోడ్డుపై రావడం అటు ఇటు వెళ్లే వాహనాల వేగం వల్ల అటువైపుగా వెళ్లే వారిపై డ్రైనేజీ నీళ్లు పడుతున్నాయి. రోడ్డుపైన చేరే డ్రైనేజీ నీరుకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన ఇంజినీరింగ్ అధికారులు కూడా ఇటువైపుగా వస్తూ పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్కడ ఎదురవుతున్న సమస్యలను గుర్తించి డ్రైనేజీ రోడ్డు మీదకు రాకుండా కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పదిలో 'వంద' లక్ష్యం

- 'లక్ష్యం' పేరుతో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- వేకువజామున చదివించేందుకు ఎంపిక చేసిన టీచర్లతో మానిటరింగ్
- సామర్థ్యంపై విద్యార్థులకు ప్రతి సబ్జెక్టులో పరీక్షలు
- ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ శ్రద్ధ



సాక్షి, మేడ్చల్ జిల్లా: పదిలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటి వరకు నిమగ్నమై ఉన్న ఉపాధ్యాయులు.. అవి ముగిసిన నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై శ్రద్ధ తీసుకుంటోంది. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాన్ని పెంచి, వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధం చేసేందుకు 'లక్ష్య' పేరుతో ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి చేయడంతో పాటు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు సిలబస్ పూర్తి చేసి, జనవరి నుంచి రివిజన్ చేసే ప్రక్రియను కొనసాగించేలా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

108 పాఠశాలల్లో 7 వేల మంది విద్యార్థులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 108 ఉన్నత పాఠశాలలో 7 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉమ్మడి రంగారెడ్డి పరిధిలోని మూడు జిల్లాల్లో పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలిస్తే.. కొత్తగా ఏర్పడిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2016-17 సంవత్సరంలో 85.22 శాతం, 2017-18లో 87.90 శాతం, 2018-19లో 92.98 శాతం. 2020-21లో 92 శాతం, 2022-23 విద్యా సంవత్సరంలో 87 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని 108 ప్రభుత్వ హైస్కూళ్లలో ఇప్పటికే డిజిటల్ విద్య అమల్లో ఉంది. గతేడాది పదో తరగతిలో ఎక్కువగా ఫెయిల్ అయినట్లు భావిస్తున్న గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.

మెరుగైన ఫలితాలే లక్ష్యం

పదిలో ఉత్తమ ఫలితాలు లక్ష్యంగా చర్యలు చేపడుతున్నాం. విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు 'లక్ష్యం'లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అసెంబ్లీ ఎన్నికలు ముగియటంతో ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో సిలబస్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈసారి జిల్లా నుంచి పదో తరగతిలో అత్యధిక మార్కులు విద్యార్థులు సాధించేలా కృషి చేస్తున్నాం.

– ఐ.విజయకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా.

విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణతో..

పాఠశాల పని దినాల్లో ఉదయం వేళల్లో బాలికలకు, సాయంత్రం బాలురకు ఒక గంట అదనంగా ప్రత్యేక తరగతులను నిర్వహించేలా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. వారానికి దాదాపు 12 క్లాసులు బోధిస్తున్న ఉపాధ్యాయులు ఇందులో నాలుగు క్లాసులు గణితం, ఐదు క్లాసులు సామాన్య శాస్త్రం, మూడు క్లాసులు సాంఘిక శాస్త్రం, ఆంగ్లం, తెలుగు బోధించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పదో తరగతి విద్యార్థులను ఫిబ్రవరి నుంచి ప్రతిరోజూ ఉదయం 4 నుంచి 5 గంటల వ్యవధిలో ఫోన్ల ద్వారా నిద్రలేపేందుకు కూడా ప్రత్యేక ఉపాధ్యాయులను కేటాయించటంతో పాటు వారి పనితీరును పర్యవేక్షించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తోంది.